క్లుప్తంగా

పరామర్శ



చెన్నారెడ్డిని పరామర్శిస్తున్న పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని కొత్తసంగటిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కేశవరెడ్డి తండ్రి చెన్నారెడ్డిని బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. చెన్నారెడ్డి అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. అలాగే కోనాయపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జి.గంగిరెడ్డి(55) గుండె పోటుకు గురై మృతి చెందడంతో మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, నాయకులు రఘునాథ్‌రెడ్డి, శివారెడ్డి, అదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ ఎంతో అవసరం

వేముల : ప్రతి ఖాతాదారుడికి ఇన్సూరెన్స్ ఎంతో అవసరమని ఏపీజీబీ అసిస్టెంట్ మేనేజర్ నందకిశోర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని గొందిపల్లెలో ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన ఇన్సూరెన్స్ యోజన పథకాలపై ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో పంట రుణాలు, డ్వాక్రా రుణాలు తీసుకున్న ప్రతి ఖాతాదారుడికి ఈ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఇంకా బ్యాంకులోని ఖాతాదారులెవరైనా ఇన్సూరెన్స్ చేసుకోకపోతే పీఎంజేజేవై, పీఎంఎస్‌వై ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు. ఈ ఇన్సూరెన్స్ ఉన్నట్లయితే ఖాతాదారుడికి ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ పొందే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఖాతాదారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు రామలింగ చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక మారుతి హాలు రోడ్డు చౌడమ్మ వీధిలో ఉన్న రామలింగచౌడేశ్వరి ఆలయంలో గురువారం అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిచనున్నట్లు మచ్చా రాజేంద్రప్రసాద్ తెలిపారు.

వల్లూరులో..

వల్లూరు : దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీలలో వెలసిన చౌడేశ్వరీ మాత ఆలయాలలో ఆషాడ అమావాస్య సందర్భంగా గురువారం చౌడేశ్వరీ మాత జన్మదిన మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

రాజకీయాలకతీతంగా ధర్మ పోరాటానికి సిద్ధం

పులివెందుల టౌన్ : పోలేరమ్మ గుడి సమస్య విషయమై రాజకీయాలకతీతంగా ధర్మ పోరాటానికి సిద్ధంగా ఉండాలని హిందు ఐక్య వేదిక జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని స్థానిక అంకాలమ్మ దేవస్థాన మండలంలో హిందు సంఘాలు, హిందు ప్రముఖులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందు ఐక్య వేదిక జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఎంతో మహిమగల ప్రాచీన కాలం నుంచి కొలువై శ్రీపోలేరమ్మ గుడిని తొలగించేందుకు ఒక వర్గం కుట్రలు చేస్తోందని, అందుకు అనుగుణంగానే ప్రతి చిన్న విషయాన్ని వారు రాద్ధాంతం చేస్తున్నారన్నారు. పోలేరమ్మ తల్లిని బొడ్డు రాయితో వారు పోల్చడంపై వారు తీవ్రంగా మండిపడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గుడి ప్రాంగణంలో వారు నిర్మాణాలు చేపడతామని, గుడికి ఇంతే ఇన్ని అడుగులే దానం ఇస్తామని పేర్కొనడం ఏమిటని వారు ప్రశ్నించారు. గుడి ప్రాంగణంలో విరిగిపోయిన త్రిశూలాన్ని ప్రతిష్టిస్తుంటే వారు అభ్యంతరం వ్యక్తం చేయడం ఏమిటని పలువురు ప్రశ్నించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో ఏ పోరాటాలకైనా సిద్ధంగా ఉండాలన్నారు.

సేవలు భేష్

కమలాపురం : మన ఊరు సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు భేష్ అని సీఐ ఎస్‌కే రోషన్ అభినందించారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డు వద్ద ట్రస్ట్ 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చైర్మన్ శీలం శ్రీనివాసులు ఏర్పాటు చేసిన చీరలను సీఐ పేద మహిళలకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



మాణిక్యరాజు (ఫైల్)

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని హనుమద్‌గిరి గ్రామం వద్ద ఈనెల 17వ తేదీ బైక్‌ను కారు ఢీకొన్న సంఘటనలో గాయాలైన తలారి మాణిక్యరాజు(20) కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కొండాపురం మండలం చౌటిపల్లె గ్రామానికి చెందిన తలారి మాణిక్యరాజు సొంతపనుల నిమిత్తం స్వగ్రామం నుంచి జమ్మలమడుగుకు వస్తుండగా కారు బైక్‌ను ఢీకొంది. పరిస్థితి విషమించడంతో కర్నూల్‌కు తరలించారు. మృతుడి చిన్నాయన నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

మాటల్లోనే ఇంపు.. ఊరంతా కంపు..!

- చెత్త తొలగింపులో గ్రామ పంచాయతీ దారుణంగా విఫలం
- ఎక్కడ చూసినా పేరుకుపోతున్న వ్యర్థాలతో ప్రజల నానా అవస్థలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



వడ్డెర వీధిలోని శ్రీకృష్ణ ఆలయం వద్ద పేరుకపోయిన చెత్తాచెదారాలు

వేంపల్లె : వేంపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం పడకేసింది. పాలకుల మాటలు చూస్తే ఎంతో ఇంపుగా ఉంటున్నాయి. ఆచరణలో చూస్తే మాత్రం గ్రామపంచాయతీ అంతా దుర్వాసన వచ్చేలా ఎక్కడ చెత్త అక్కడే కుప్పలుగా కనిపిస్తోంది. అధికారులు పలు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా ఫలితం మాత్రం దక్కడంలేదు. ప్రజలు ఇబ్బందులు తొలగించాలని ఆలోచన నిజంగానే ఉంటే శాశ్వత చర్యలు తీసుకుంటేనే సమస్య పరిష్కారమయ్యే వీలుంటుందని గ్రామ పంచాయతీ ప్రజలు పేర్కొంటున్నారు.

వేంపల్లె మేజర్ గ్రామపంచాయతీలో ఎక్కడా గార్బేజ్ పాయింట్లు వద్ద చెత్తాచెదారాలు ఉండటానికి వీల్లేదని.. అవి కనిపిస్తే సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్, పారిశుద్ధ్య సిబ్బందిదే బాధ్యత వహించాలని మండల అభివృద్ధి అధికారి ఆదేశాలు ఇచ్చారు. కానీ గ్రామ పంచాయతీలోని పలుచోట్ల గ్యార్బేజ్ పాయింట్ల వద్ద చెత్తాచెదారాలు కనిపిస్తూనే ఉన్నాయి. సకాలంలో ఇంటింటికి చెత్త సేకరణ జరగకపోవడంతోపాటు పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది.

నామమాత్రంగా పర్యవేక్షణ

ఐదు నెలలుగా పంచాయతీ, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో సిబ్బంది సక్రమంగా పనిచేయలేదు. అంతేకాకుండా గ్రామపంచాయతీ ఈఓ లేకపోవడం, తదితర కారణాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ చెరుకూరు శ్రీధర్, డీపీఓ రాజ్యలక్ష్మిల ఆదేశాల మేరకు మైలవరం గ్రామపంచాయతీ నుండి పదోన్నతి కల్పించి కొత్త ఈఓగా మాధవరెడ్డిని నియమించారు. మేజర్ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగు కోసం గ్రామపంచాయతీ ఈఓను నియమించినప్పటికీ ఆశించిన స్థాయిలో పారిశుద్ధ్యం మెరుగుపడటం లేదు. గ్రామ పంచాయతీలో మొత్తం సుమారు 70 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఇంటింటి వద్దకు చెత్త సేకరణకు 26మంది క్లాప్ మిత్రులు ఉన్నారు. ఇంతమంది ఉన్నా.. పారిశుద్ధ్యం ఆశించిన స్థాయిలో మెరుగుపడటంలేదు. చెత్తను ఎక్కడపడితే అక్కడ డంప్ చేయడంతో సీజనల్ వ్యాధులు భయం వెంటాడుతోంది.

దోమలు విజృంభిస్తున్నాయి



గ్రామ పంచాయతీలో రోడ్లు, డ్రైనేజీ వెంబడి చెత్త చెదారాలతో నిండి పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఏ వార్డులో చూసినా గుట్టలు గుట్టలుగా చెత్తాచెదారాలతో నిండి ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా డ్రైనేజీలలో చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో మురుగునీరంతా రోడ్లపైన పారుతుంది. దీంతో దోమలు విపరీతంగా పెరిగి విజృంభిస్తున్నాయి. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

– రామాంజనేయులు, శ్రీకృష్ణ ఆలయ ప్రతినిధి, వేంపల్లె

నిర్వహణ లేక నిరుపయోగం



గ్రామ పంచాయతీలో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రం నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. ఈ కేంద్రంలో పొడి చెత్త, తడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేరు చేసే విభాగాలు ధ్వంసమయ్యాయి. దీంతో చెత్తను డంపింగ్ యార్డు ఆవరణలో డంప్ చేస్తున్నారు. కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి వర్మీ కంపోస్టు తయారీకి చర్యలు తీసుకోవాలి.

– షేక్ నిస్సార్ బాషా, స్థానికుడు, వేంపల్లె

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతులకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు ఉలవలపల్లెలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ

పెండ్లిమర్రి : కొండూరు గ్రామ పంచాయతీలోని ఉలవపల్లెలో గురువారం సాయంత్రం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి హాజరైతారన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

నేడు పాలగిరిలో ..

వీరపునాయునిపల్లె : మండలంలోని ఎన్.పాలగిరిలో గురువారం ఉదయం 7.30 గంటలకు చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవు

పులివెందుల టౌన్ : ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. బుధవారం పట్టణంలోని పలు టీ, కాఫీ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన ఐఎస్ఐ మార్క్ కలిగిన టీ, కాఫీ పొడులనే వాడాలని సూచించారు. అనంతరం కిరాణా షాపులను తనిఖీ చేసి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బీఎంఎస్ అవిర్భావదినోత్సవం

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మండలంలోని ఆర్టీపీపీలో బుధవారం భారతీయ మజ్దూర్ యూనియన్ 71వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జెండా వందనం చేశారు. ఈ సందర్భంగ వ్యవస్థాపకుడు దత్తుపంత్ బాపూరావు తెంగిడి స్థాపించిన భారతీయ మజ్దూర్ సంఘ్ యూనియన్ నేడు కార్మిక సమస్యలపై పోరాటం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెన్కో సెక్రటరీ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతోనే వైఎస్సార్ సీపీ ప్రయాణం



ఎర్రగుడిపాడులో ప్రజలతో మాట్లాడుతున్న నరేన్ రామాంజులరెడ్డి



పులివెందులలో మాట్లాడుతున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి



వేములలో కరపత్రాలను చూపుతున్న మండల ఇన్‌చార్జి, జెడ్పీటీసీ

కమలాపురం : అధికారంలో ఉన్నా, లేక పోయినా వైఎస్సార్‌సీపీ ప్రయాణం ప్రజలతోనేనని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని ఎర్రగుడిపాడు గ్రామంలో వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ రీకాలింగ్ చంద్రబాబుస్ మెనిఫెస్టో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో వెలసి ఉన్న వైఎస్సార్ నిలయంలోని మహానేత వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు మెనిఫెస్టోను గుర్తుకు తెస్తూ బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అంటూ ఇంటింటికి తిరిగి గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు ఉన్న తేడాను ఆయన ప్రజలకు వివరించారు. గతంలో పింఛన్, రేషన్ అన్ని ఇంటికే వచ్చేవన్నారు. ఇపుడు రేషన్ తెచ్చుకోవాలంటే కిలోమీటర్ల కొద్ది నడవాల్సి ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో సున్నావడ్డీ, వైఎస్సార్ ఆసరా, ఆరోగ్య భరోసా, రైతు భరోసా, జగనన్న తోడు తదితర పథకాలన్నీ వచ్చేవన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 14 మాసాలు అవుతోందని, సీఎం చంద్రబాబు దాదాపు రూ.2లక్షల కోట్లు అప్పు చేశారని, సూపర్ సిక్స్‌లో ఏ ఒక్క హామీ అయినా అమలు చేశారా? అని ప్రజలను అడగగా చంద్రబాబు మాటలకు మోసపోయామని మహిళలు అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, గంగాధర్ రెడ్డి, గండి భాస్కర్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఇస్మాయిల్, సాదిక్, సుధా కొండారెడ్డి, సత్యంరెడ్డి, దేవదానం, జిలానీ బాషా, జెట్టి నగేష్, మునీంద్రారెడ్డి, రాజారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రామలక్ష్మీరెడ్డి, శేఖర్, సుబ్బన్న, చంద్రపాల్, మైసూరారెడ్డి, విజయేంద్రారెడ్డి, నారాయణరెడ్డి, కుమార్‌రెడ్డి, స్థానిక నాయకులు మల్లికార్జునరెడ్డి, కన్నయ్య, సుబ్బారెడ్డి, క్రిష్ణయ్య, రామక్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : కొండపేటలో బుధవారం బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ నరేన్ రామాంజులరెడ్డి పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం సూపర్ ఫెయిల్యూర్ అయ్యిందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, నేతలు మాసీమబాబు, దిలీప్‌రెడ్డి, సురేష్‌యాదవ్, తుంగ చంద్రయాదవ్, నారాయణరెడ్డి, ఎంపీటీసీలు నాగిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, చంద్ర, భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, భాగ్యమ్మ, రవీంద్రారెడ్డి, చిన్నబాబు, ఉమామహేశ్వర్‌రెడ్డి, తుపాకుల జనార్దన్‌రెడ్డి కేశవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అన్వర్, అశ్రత్, వారిష్ జుమన్ తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో బుధవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, నూర్‌బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, వాల్మీకి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అంబకపల్లె నారాయణస్వామి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చంద్రమౌళి, కౌన్సిలర్లతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన మేనిఫెస్టో సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడం వలన ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఎండగడుతున్నారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. మున్సిపాలిటీలో ప్రతి ఇంటికి వెళ్లి బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీపై వివరిస్తూ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయిస్తే బాబు మోసాలు బయటపడతాయన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజల పక్షాన ఉంటామన్నారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దిశా, దశ నిర్దేశించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపాలిటీలో ఇప్పటివరకు ఒక్క వీధిలైటు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. మీరు ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని దౌర్జన్యాలు చేసినా భయపడే ప్రసక్తే లేదన్నారు. అనంతరం ఇటీవల వైఎస్సార్‌సీపీలో పదవులు పొందిన వారికి కండువాలు వేసి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాలఅశ్వర్థరెడ్డి, రమేష్ నాయుడు, వీరారెడ్డి, సుధీకర్‌రెడ్డి, నాగరాజు, సంపత్, సోఫాల వీరా, కనక, లక్ష్మీనారాయణరెడ్డి, తులసిరామిరెడ్డి, శ్రీరామిరెడ్డి, రఘు, శ్రీనివాసుల రెడ్డి గంగన్న, రామ్మూర్తిరెడ్డి, శ్రీరామ్, రమేష్, రాజేష్, చలపతి, రాయుడులతోపాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డిలు తెలిపారు. వేములలో బుధవారం చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకు తెస్తూ బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోసం చేసి అధికారంలోకి వచ్చిన బాబు మోసాలను గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఎండగడదామని పిలుపునిచ్చారు. ఇన్ని మోసాలు చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుదామని, వారు చేసిన అమలు కానీ హామీలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్లను నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా వెంకటనారాయణ, రాఘవరెడ్డి, రాధాకృష్ణయ్య, రామసుబ్బారెడ్డి, మదార్‌వల్లి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గౌస్ పీరా, సుబ్బారెడ్డి, యువజన విభాగపు కార్యవర్గ సభ్యులు సునీల్‌కుమార్, నియోజకవర్గ వికలాంగుల అధ్యక్షుడు భాస్కర్, మునీర్, నాగేష్, గంగులయ్య, గంగాధర్, జర్మియ, రాజన్న, హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, చలమారెడ్డి, శివశంకర్‌రెడ్డి, నాగమల్లారెడ్డి, మల్‌రెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖరరెడ్డి, రెడ్డయ్య, మహేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి. సి.బి.విజయభాస్కర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, పుల్లారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృషభాచలేశ్వర దేవస్థాన ఆదాయానికి గండి



వేంపల్లెలోని వృషభాచలేశ్వర దేవస్థాన గదులు

వేంపల్లె : స్థానిక వృషభాచలేశ్వరస్వామి దేవస్థానం ఆదాయానికి గండి పడింది. ఈ విషయం ఆలస్యంగా వెలుల్లోకి వచ్చింది. దేవస్థానానికి సంబంధించి వేంపల్లె నాలుగు రోడ్ల కూడలిలో 31 షాపింగ్ కాంప్లెక్స్ గదులు ఉన్నాయి. ప్రస్తుతం ఇక్కడ కొత్త ఈవో హనుమంతరావు నియమితులై బాధ్యతలు తీసుకున్నారు. గతంలో పులివెందుల గ్రూప్ టెంపుల్‌గా పనిచేస్తున్న విశ్వనాథరెడ్డి ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో 1, 2, 6, 13, 14, 30 నెంబర్ల గల షాపింగ్ గదులకు సంబంధించి బాడుగలు సక్రమంగా చెల్లించకపోవడంతో వారిని రద్దు చేయించారు. తర్వాత నామమాత్రంగా వేలంపాట నిర్వహించి ఈఓ విశ్వనాథరెడ్డి తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తులకు గతంలో ఉన్న బాడుగ రేట్ల కంటే తక్కువ రేట్లకు కట్టబెట్టారు. ఆరు షాపింగ్ గదులకు సంబంధించి గతంలో కంటే నెలకు రూ 38,472 ఆదాయం తగ్గగా.. ఏడాదికి రూ.4.49 లక్షల ఆదాయానికి గండి పడింది. ఇది కేవలం ఆయన మామూళ్లు తీసుకుని తమకు అనుకూలమైన వ్యక్తులకు అప్పగించారని మిగిలిన షాపింగ్ గదులు యజమానులు వాపోతున్నారు. గత ఏడాదిగా మాకు కూడా వ్యాపారాలు సరిగా జరగడం లేదని మాకందరికీ కూడా బాడుగ రేట్లను తగ్గించాలని వారు కోరుతున్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల పాత్ర అనిర్వచనీయం

వేంపల్లె : పట్టణంలోని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్, చరిత్ర శాఖల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు బాల గంగాధర తిలక్, చంద్రశేఖర్‌అజాద్‌ల జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్ర పటాలకు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సతీష్, అధ్యాపకులు నివాళులర్పించారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి

వేముల : వేరుశనగ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కె.కె.కొట్టాల గ్రామంలో బుధవారం హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి, ఏఓ ఓబులేసులతో కలిసి వేరుశనగ పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సాగులో ఉన్న వేరుశనగ పంట దిగుబడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ వేరుశనగ పంట రక్షణగా సజ్జ, జొన్న పంటలను వేసుకోవాలన్నారు. దీనివల్ల రసంపీల్చే పురుగుల ఉధృతి తగ్గుతుందని, మొవ్వకుళ్లు తెగులు నివారించుకోవచ్చునన్నారు. జిప్సం వాడటంవలన నూనెలో గింజ శాతం నాణ్యత పెరుగుతుందన్నారు. వేరుశనగ సాగు చేసే రైతులు ఎకరాకు 200కిలోల జిప్సం వేసినట్లయితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. జిప్సం, జింక్ సల్ఫేట్ వచ్చిన వెంటనే రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సురేష్, రమణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చీనీలో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



చీనీ తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి

సింహాద్రిపురం : చీనీ తోటలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్రబాబు తెలిపారు. బుధవారం మండలంలోని హిమకుంట్ల గ్రామంలో చీనీ తోటలలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై చీనీ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీనీ తోటలలో నీరు అధికంగా ఉండటంవల్ల తేమ ఆరకపోవడంవలన చెట్టు వేర్లు త్వరగా కుళ్లిపోయి క్షీణిస్తాయన్నారు. చీనీచెట్లు దెబ్బతినకుండా ఉండాలంటే రోజుకు 60 లీటర్లకు మించి నీరు ఉండకూడదన్నారు. అలాగే చీనీ చెట్లలో పొలుసు పురుగు, బంక తెగులు ఎక్కువగా ఉండటంవల్ల చెట్లు త్వరగా చనిపోతాయన్నారు. వీటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ మల్లేశ్వరరెడ్డి, రైతు సేవా కేంద్ర సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

పులివెందుల రూరల్ : ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితమని, ప్రయాణీకులందరూ ఆర్టీసీ బస్సులలో ప్రయాణించాలని ఆర్టీసీ డీఎం రామకృష్ణ తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డిపోల 112 బస్సులు ఉన్నాయని, వాటిలో 97 బస్సులు మాత్రమే తిరుగుతున్నాయన్నారు. డిపోలో సుమారు 450 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పులివెందుల డిపోకు రోజుకు రూ.16 లక్షల ఆదాయం వస్తుందన్నారు. జనవరి నుంచి జూన్ వరకు అయితే రూ.20 లక్షల ఆదాయం వస్తుందన్నారు.

పంటల ప్రీమియం గడువు పెంచండి



మాట్లాడుతున్న మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

సింహాద్రిపురం : రైతులు పంటల బీమా చెల్లించడానికి ఈనెల 15వ తేదీతో గడువు ముగిసిందని రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని, దీంతో చాలామంది రైతులు పంటల బీమా కట్టుకోలేకపోయారని ఈ గడువును పెంచాలని మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అరుణ అధ్యక్షతన ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ రైతులు మండలంలో ఎక్కువగా చీనీ, అరటి సాగు చేశారని, వీటికి బీమా చెల్లించేందుకు ఈనెల 15వ తేదీతో గడువు ముగియడంతో చాలామంది రైతులు చెల్లించలేదన్నారు. గతంలో ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించేదన్నారు. అధికారులు రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారన్నారు. ప్రతి ఒక్కరూ జీరో అకౌంట్ చేసుకుని బీమా చెల్లించి సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం మంజునాథ తెలిపారు. అనంతరం హౌసింగ్ ఏఈగా ఉన్న వాసుదేవరెడ్డి హౌసింగ్ డీఈగా పదోన్నతి పొందడంతో మండల ఉపాధ్యక్షుడుతోపాటు మండల స్థాయి అధికారులు అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాయినాథ్‌రెడ్డి, ఉపాధి హామీ ఏపీఓ జయభారతి, మండల కో ఆప్షన్ మెంబర్ నజీర్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కక్షలు మానండి - ఆత్మీయంగా జీవించండి



మాట్లాడుతున్న సీఐ చల్లని దొర

పెండ్లిమర్రి : గ్రామాల్లో చిన్న, చిన్న సమస్యలకు గొడవ పడి జీవితాలను నాశనం చేసుకోకుండా ప్రతి ఒక్కరు కక్షలు మానుకొని ఆత్మీయంగా జీవిస్తూ బిడ్డల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని రూరల్ సీఐ చల్లని దొర తెలిపారు. బుధవారం రాత్రి చెన్నంరాజుపల్లెలో ఫ్యాక్షన్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ మేలు కొలువు నాటక ప్రదర్శ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కక్షలకు దూరంగా ఉండి ప్రశాంత జీవితాన్ని గడపాలన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం కళాజాత బృందం సభ్యులు ఫ్యాక్షన్ వల్లన కలిగే అనర్థాల గురించి ప్రజలకు నాటక ప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, నాటక బృందం సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.